కథ

# మిడిల్ క్లాస్ డ్రీమ్

**జె.సునీల్**

"మనమూ కాసింత స్థలం కొని, ఇల్లు కట్టుకుందామండీ"

భాస్కర్, శారదకేసి అదోలా చూసాడు. 'మనిషి కడుపునిండటం మొదట చూస్తాడు. కడుపునిండాక సొంతగూటిలో ప్రశాంతంగా నిద్రపోవాలనుకుంటాడు. సొంతంగా గూడు ఏర్పరచుకోవడమే కొందరి లక్ష్యం. ఆ కల సాకారమే మరికొందరి జీవిత ధ్యేయం...నిజానికి తన మనసులోని కోరికా అదే! కాని...?!'

"ఈ మహానగరంలో ఓ వంద గజాల స్థలం కొనాలన్నా, మన స్థితి సరిపోదు శారదా"

తన భర్త ఆమాత్రం స్పందించడంతో శారదకు ఉత్సాహం వచ్చేసింది. 'ఈమధ్యకాలంలో ఆమెకు సొంత ఇంటి ధ్యాస ఎక్కువే అవుతోంది. ఎప్పుడైనా పుట్టింటికివెళ్తే, తెలిసినవాళ్ళంతా 'అక్కడేదైనా ఆస్తిపాస్తి కొన్నారా?...ఇంకా కిరాయి ఇంట్లోనే వుంటున్నారా?' అని ప్రశ్నిస్తుంటే, తలకొట్టేసినట్టుగా అవుతోంది. ఇప్పుడిప్పుడే బాధ్యతలూ పెరుగుతున్నాయి. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్ళకైనా ఏదో ఒకటి సమకూర్చి పెట్టాలి.

"సిటీ మధ్యలో కొనడానికి మన స్థితి సరిపోదు గానీ, సిటీకి దూరంగా ఓ వందగజాలు కొనడానికి మన స్థితి సరిపోతుందనే అనుకుంటున్నాను. అందులోనూ అందరూ చెప్పుకునేదేంటంటే - మరో రెండు, మూడేళ్ళ తర్వాత ఎవ్వడు కొనాలన్నా గజం స్థలం కూడా దొరకదట"

అతడు నిలువుగా తలాడించాడు. 'ఈ మాట తను రోజూ వింటూనే వున్నాడు. హఠాత్తుగా స్థలాల రేట్లు అమాంతం పెరిగిపోయాయి. పెరుగుతున్న రేట్లను చూస్తుంటే, భవిష్యత్‌లో తనలాంటివాడికి సొంత ఇల్లు ఒక కలలాగే మిగిలిపోయే అవకాశముంది. అందుకే ఎంతో కొంత ధైర్యం చేసి, అప్పోసప్పో చేసి కాసింత జాగా తీసిపెట్టుకోవడమే మంచిది'

"ఏంటాలోచిస్తున్నారు?"

"నువ్వు చెప్పిన మాటల గురించే ఆలోచిస్తున్నాను. ఇప్పుడే మనం తొందరపడాలి. సిటీలో కాసింత స్థలమంటూ కొనిపెట్టుకుంటే జీవితానికింక నిశ్చింత వుంటుంది"

శారద ముఖంలో సంతోషం కదలాడింది. 'ఆయన కూడా తనలాగే ఆలోచిస్తున్నాడు కాబట్టి తను కాస్త తొందరపెడితే, సొంత ఇంటి కల నెరవేరుతుంది'

"మరిక ఆలస్యమెందుకండీ? మీకు తెలిసిన వాళ్ళనెవర్నయినా స్థలాల గురించి ఎంక్వయిరీ చేయండి"

"రేపటినుండి ఆ పనిలోనే వుంటాను"

శారద హుషారుగా వంటగది వైపు వెళ్తే, భాస్కర్ బయటకు నడిచాడు.

★ ★ ★

సిటీలో 'రియల్ బూమ్' నడుస్తోంది. ఎక్కడ స్థలమున్నా, ఎంత ధరకైనా కొనడానికి జనం సిద్ధపడిపోతున్నారు. సిటీకి ఇరవై, ముప్ఫయ్ కిలోమీటర్ల దూరంలో కూడా ఎకరం యాభై కోట్లు, వంద కోట్లు అంటుంటే, సామాన్యుడికి ఏం జరిగిపోతుందో అర్థం కావడం లేదు. తను ఆలస్యం చేస్తే, ఈ భూమ్మీద తనకంటూ అరగజం స్థలం కూడా దొరకదని అతడిలో భయం మొదలయ్యింది. ఏదో చేయాలి. ఎలాగోలా తనూ కాసింత స్థలం సంపాదించుకోవాలి. అదృష్టవశాత్తు, ఆర్థికస్థితి కాస్త బాగున్నా, బ్యాంకులు పర్సనల్ లోన్‌లు, క్రెడిట్ కార్డు, ప్రాపర్టీలోన్స్ ఇస్తున్నాయి. వీటిని కూడా ఉపయోగించుకుంటే, ఎలాగోలా స్థలం కొనటం అంత కష్టం కాబోదు...

భాస్కర్ పరిస్థితిని ఓ కోణంలో బాగానే పరిశీలించాడు. 'నగరం సరిహద్దుల్లో ఓ రెండొందల గజాల స్థలం కొనుక్కుంటే ఐదారు లక్షలవుతుంది. ఓ ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తూ తను దాచుకున్నది ఓ రెండు లక్షలుండొచ్చు. శాలరీ సర్టిఫికెట్ మీద పర్సనల్ లోన్, బ్యాంక్ అక్కౌంట్ మీద క్రెడిట్‌ల రూపంలో ఓ రెండు, మూడు లక్షలు డ్రా చేయొచ్చు. ఓ లక్ష ఎవరో ఒకరి దగ్గర అప్పుచేస్తే కొంటున్నది స్థిరాస్తే కాబట్టి బాధపడాల్సిన అవసరమూ లేదు..'

అతడు మిత్రుల దగ్గర సొంత ఇంటి కల గురించి చెపితే, అందరూ ఎంకరేజ్ చేసారు. "పెరుగుతున్న స్థలాల రేట్లు చూస్తుంటే భవిష్యత్‌లో మనం కొనలేం భాస్కర్! ఇప్పుడే తొందరపడు" అన్నారు వాళ్ళంతా.

మరింత ఉత్సాహం వచ్చేసింది అతడికి. తెలిసినవాళ్ళ ద్వారా స్థలాల గురించి ఫ్లాట్స్, ప్లాట్స్ గురించి ఎంక్వయిరీ చేయడం మొదలుపెట్టాడు.

అతడు స్థలంకొనే ఉద్దేశ్యంలో వున్నాడని తెలియడంతో, ఎవరెవరో వచ్చి కలుస్తున్నారు. "ఇది ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సార్! ఇక్కడ ఎకరం పాతిక కోట్లు..మన ప్లాట్స్‌లో గజం కేవలం ఆరు వేలకే ఇస్తున్నాం. రెండొందల గజాలు ఓన్లీ ట్వల్వ్ లాక్స్..ఆర్నెల్లు ఆగితే, అక్కడ గజం పాతికవేలు అవుతుంది"

"విజయవాడ హైవే సార్! రెండొందల గజాలు ఎనిమిది లక్షలు.."

"బోంబే హైవే సార్...ఓన్లీ సిక్స్‌లాక్స్..ఒక్క సంవత్సరం తర్వాత ఇదే స్థలం పదీ, పన్నెండు లక్షల రేటు పలుకుతుంది"

అప్పటివరకూ వున్న సొంత ఇంటి కల కాస్తా, భవిష్యత్‌లో పెరగబోయే రేట్లతో తను పొందబోయే లాభం గురించి ఆలోచించే స్థితికి చేరుకుంది. 'తల తాకట్టుపెట్టయినా మరో రెండు, మూడు లక్షలు తెచ్చి ఓ రెండు ప్లాట్స్ కొంటే, ఆర్నెల్లు, సంవత్సరం తర్వాత ఓ ఫ్లాట్ అమ్మేస్తే వచ్చే లాభంతో చక్కగా ఇల్లు కట్టుకోవచ్చు...'

అతడు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాడు. డబ్బు వరదలా పారుతున్న ఆ సమయంలో అప్పు దొరకడం అంత కష్టం కాలేదు.

భాస్కర్ అప్పు చేసి నాలుగొందల గజాల స్థలం కొన్నాడు. సొంత ఇంటి కలను తాత్కాలికంగా వాయిదా వేస్తూ, ఆ కలకు ఆ స్థలంతో ముడిపెట్టుకున్నాడు.

★ ★ ★


ఆర్నెల్లు గడిచాయి.

స్థలాల రేట్లు కాస్త పెరిగాయి. "ఇప్పుడే అమ్మవలసిన అవసరమేముంది? మరో ఆర్నెలలు ఆగితే మరికాస్త పెరిగితే, అప్పుడు ఓ ప్లాటు అమ్మేసి, అప్పులు తీర్చేసి, మిగిలిన డబ్బుతో ఇల్లు కట్టుకోవచ్చు"

మరో ఆర్నెల్లు గడిచినా స్థలాల రేట్లు పెద్దగా పెరగలేదు. పైగా అప్పుడప్పుడే అప్పు ఇచ్చినవాళ్ళ నుండి వత్తిడి మెల్లగా మొదలయ్యింది. 'సరే! ఒక ప్లాట్ అమ్మేస్తే అప్పుల సమస్య కాస్త తగ్గుతుంది. తన ఇంటి ప్లాట్ అలాగే వుంటుంది' అనుకుని అతడు తన ప్లాట్‌ని అమ్మకానికి పెట్టాడు.

సరిగ్గా అప్పుడే రాజకీయ సమీకరణాలు మారాయి. 'మహానగరాన్ని ఎందరో వదలి వెళ్ళవలసి వస్తుందన్న' అనుమానాలూ మొదలయ్యాయి. జనంలో కంగారు. వ్యాపారాల్లో ఒడిదుడుకులు. 'ఉన్నంతలో చక్కబెట్టుకుందామన్న' ప్రయత్నాలు.

దాంతో స్థలాల రేట్లు సగానికి సగం పడిపో



యాయి. అప్పటివరకూ తన స్థలం మీద కాసో కూస్తో లాభం వస్తుందనుకున్న భాస్కర్ ఒక్కసారిగా కంగుతిన్నాడు. ఏదో భయం మొదలయ్యింది. పరిస్థితి మారుతుందన్నది గ్రహించటంతో అప్పులవాళ్ళ తాకిడి ఎక్కువయ్యింది.

ఓరోజు పర్సనల్ లోన్ కలెక్షన్ కోసం బ్యాంక్ నుండి వచ్చిన కుర్రాడు, ఆఫీసులో అందరి ముందు గొంతు పెంచి అసహ్యంగా మాట్లాడాడు. దాంతో ఎంతో కాలంగా పెంచుకున్న గౌరవం, ఒక్కసారిగా మంటగలసిపోయింది. కొలీగ్స్‌లో కొందరు తనకేసి జాలిగా చూసారు. జాలి చూపులు తట్టుకోవడం ఎంత కష్టమో, తనకు అప్పుడే అర్ధమయ్యింది.

చిరాకు, అసహనం, బాధ, భయం - రకరకాల ఫీలింగ్స్ కలగలసిపోయిన స్థితిలో అతడు ఇంటికి చేరుకున్నాడు.

అతడి ముఖం చూసిన శారద "ఏమండీ..ఏంటలా వున్నారు? ఏం జరిగిందేటి?" అనుమానంగా అడిగింది.

భాస్కర్ భార్యను కౌగిలించేసుకుని బావురుమన్నాడు.

ఆమె ఒక్కసారిగా కంగారుడిపోయింది. "ఏవండీ! ఏం..ఏం..జరిగిందేంటి?" మరోసారి ప్రశ్నించింది.

అప్పుడే స్కూల్‌లో ట్యూషన్ ముగించుకుని వచ్చిన పిల్లలు తల్లిదండ్రుల పరిస్థితి గమనించి బాగా భయపడిపోయారు.

అతడు మనసులోని బాధనంతా బయటపెట్టాడు.

శారదకూ తమ పరిస్థితి కొంత అర్ధమవుతూనే వున్నా, దాని తీవ్రత ఏమిటో ఇప్పుడే పూర్తిగా తెలిసిపోయింది.

"సర్లేండి ఏదో కాస్త ఒడిదుడుకులే తప్ప, మనం పెద్దగా భయపడాల్సిందేమీ లేదు. ఒక ప్లాట్ ఎంతో కొంత నష్టానికైనా అమ్మేయండి.

వత్తిడి వున్న అప్పుల్ని కట్టేస్తే, ఇక బాధేముంది?"


"నష్టపోవడం ఇష్టం లేకనే ఇంతగా కష్టపడటం! ఆ నష్టానికే తెగిస్తే ఇక ఈ కష్టాలెందుకు?" నష్టపడడం ఇష్టంలేకపోయినా మధ్యతరగతి మానవుడికి పరువు సమస్య ఎదురైతే, అతడు దానికీ తెగిస్తాడు.

భాస్కర్ ఒక ప్లాట్‌ని నష్టానికి అమ్మడానికి సిద్ధపడ్డాడు గానీ, మరీ అంతగా నష్టపోవలసి వస్తుందనుకోలేదు. 'అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి' అన్న సామెత ఎంత అక్షర సత్యమో అతడికి అప్పుడే తెలిసొచ్చింది.

ఐదు లక్షలు పెట్టి కొన్న రెండొందల గజాల స్థలం మూడు లక్షలకే అమ్ముడుపోయింది. ఆ అప్పుకి వడ్డీతో కలుపుకుంటే నికరంగా మూడు లక్షలు ఒక ప్లాట్ మీద అప్పుతో కూడిన నష్టం కనిపించింది.

## ముద్దులిచ్చిన శిల్ప

ఆమధ్య స్టేజీమీదే శిల్పాశెట్టిని రిచర్డ్‌గెరె ముద్దు పెట్టుకోవడం పెద్ద సంచలనం సృష్టించింది! శిల్ప మళ్లీ పబ్లిగ్గా ముద్దు పెట్టుకుంది. ఈసారి లండన్‌లోని స్వచ్ఛంద సంస్థకి నిధులు సమకూరేందుకు చేసిందిలా. ఆ సంస్థ వారి కార్యక్రమంలో బ్రిటన్ ప్రధానితో కలిసి డిన్నర్ చేయాలంటే వేలం పాట ద్వారా ఎవరైతే ఎక్కువ మొత్తం చెల్లిస్తారో వాళ్లకి మూడు ముద్దులిస్తానని చెప్పింది శిల్ప. దీంతో ఉత్సాహం ప్రదర్శించిన ఓ కుర్ర అభిమాని పన్నెండున్నర వేల పౌండ్లకి డిన్నర్ పాడాడట. చెప్పిన మాట ప్రకారం శిల్ప అతనికి మూడు ముద్దులిచ్చేసిందిట. అఫ్ కోర్స్- ఆ మూడు ముద్దులూ చెంప మీదే లెండి.


కథా నిలయం
శ్రీకాకుళం

అతడు క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్‌లు కొంతవరకూ వదిలించుకున్నాడు. కానీ అతడు నష్టాల్లో, కష్టాల్లో వున్నాడని తెలిసినవారు మిగిలిన అప్పులు తీర్చమంటూ పట్టుపట్టారు. మరో ప్లా...టు...అమ్మాలా?!

రాష్ట్రంలోని రాజకీయ ప్రభావం ఒక ప్లాట్ అమ్మేలా చేస్తే, అంతర్జాతీయ పరిణామాలకూ సామాన్యుడే బలి అవుతున్నాడన్న వాస్తవం అతడికి తెలిసింది.

అగ్రరాజ్యంలో సబ్‌ప్రైమ్ ప్రభావం భారతదేశ ఆర్థికరంగం మీద పడింది. అప్పటివరకూ వరదలా పారిన డబ్బుకు అడ్డుకట్టపడింది. అమెరికాలో ఆస్తులు కొనడం కోసం అప్పులు చేసిన వాళ్ళు, మనీ ఫ్లో ఆగిపోవడంతో ఆ అప్పులు కట్టలేక చేతులెత్తేసారు. బ్యాంకులు ఆ ఆస్తులు స్వాధీనం చేసుకుని అమ్మకానికి పెడితే, అప్పులో సగం కూడా రికవరీ కావడం లేదు. 'ఒక ఇల్లు కొంటే, ఒక ఇల్లు ఉచితంగా ఇస్తాం' అని అమెరికన్ బ్యాంకులు అనౌన్స్ చేసినా అక్కడ ఇల్లు కొనే ధైర్యం చేయలేకపోయారెవరు?

భారతీయ బ్యాంకులూ ఈ పరిస్థితిని గమనించి హౌస్‌లోన్లు ఆపేయకపోయినా, ఇవ్వడం తగ్గించేసాయి. వడ్డీరేట్లు పెంచేసాయి.

మరోవైపు పెరిగిన స్టీలు, సిమెంట్, ఇటుక, ఇసుక..ఇల్లు కట్టుకోవడం ఇక సామాన్యులకు అసామాన్య విషయంలా మారిపోయింది.

ఆ ఆలోచనలతోనే ఆ రాత్రి నిద్రపట్టక అతడు అటునిటు తిరుగుతుంటే వెనుక నుండి భుజంమీద చెయ్యి వాలింది. ఆ చెయ్యి ఎవరిదో తెలిసి వుండడంతో అతడు కంగారుపడలేదు. మెల్లగా వెనుతిరిగి చూసాడు.

"ఇలా నిద్రమేల్కొని ఆలోచిస్తే సమస్యలు పరిష్కారం కావు"

అతడు అదోలా నవ్వాడు. కొద్దిగా భుజాలెగరేసి "నేనిప్పుడు సమస్యకు పరిష్కారం గురించి ఆలోచించటం లేదు. మన సమస్యకు పరిష్కారమేంటో నాకు తెలుసు" అన్నాడు. ఆ క్షణం అతడి గొంతులో పలికిన ఆర్ద్రత ఆమెను కదిలించేసింది.

"మరి..మరిప్పుడేం ఆలోచిస్తున్నారు?"

అతడు అరనిముషం మౌనంగా వున్నాక పెదవి విప్పాడు.."ప్రతి మనిషి కలలు కంటాడు. తన కలలు సాకారం చేసుకోవాలని పరితపిస్తాడు. బహుశా ఆ స్థితిలో అతడు తన స్థితికిమించి ఆలోచించొచ్చు. కాస్త ఆశపడొచ్చు. ఇతరులకది అత్యాశగానూ అనిపించొచ్చు..ఏదేమైనా సామాన్యుడి సొంత ఇంటి కల...ఎందరికో కలగానే మిగిలిపోతోంది. ఆ కల చుట్టూ వ్యాపారాలు. వ్యాపారాల వుచ్చులో సామాన్యుడు. నిన్న తీరుతుందనుకున్న కల, నేడు కలగానే మిగిలిపోతున్న పరిస్థితి. లాభనష్టాల బేరీజులో మారుతున్న స్థితిగతులు...ఒక్కటి మాత్రం నిజం! సొంత ఇంటి కలను నిజం చేసుకునే ప్రయత్నంలో నేను ఓడిపోయాను"

ఆమె దీర్ఘంగా నిశ్వసించింది. 'మిడిల్ క్లాస్ డ్రీమ్స్' ఇలాగే వుంటాయన్నది తనకు ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. తామే కాదు తమ లాంటి మరెందరో సొంత ఇంటి కలను నిజం చేసుకునే ప్రయత్నంలో దెబ్బతింటున్నారు.

ఇది నిజం!

"ఓటమి మనకు గుణపాఠం నేర్పింది. ఈ గుణపాఠం నుండి పాఠాలు నేర్చుకుందాం. జరిగినదంతా మర్చిపోండి"

భాస్కర్ నిలువుగా తలాడించాడు.

★ ★ ★

రెండు రోజుల తర్వాత భాస్కర్ పేపర్ తిరగేస్తుంటే కనిపించింది "చంద్రగ్రహం మీద స్థలాల అమ్మకం - ఎగబడి కొంటున్న జనం"

అతడా న్యూస్ ఆత్రంగా చదవడం మొదలుపెట్టాడు.

మనిషి తన కోరిక చుట్టూ వుండే కథల పట్ల ఆసక్తి చూపిస్తాడు. తన కలను నెరవేర్చే వార్తల మీద మోజు ప్రదర్శిస్తాడు.